సాక్షి బాపట్ల

శనివారం । 30 । డిసెంబర్ । 2023



క్యాలెండర్ ఆవిష్కరణ
గుంటూరురూరల్: రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ క్యాలెండర్‌ను ఆ శాఖ ఐజీ రామకృష్ణ శుక్రవారం గుంటూరులో ఆవిష్కరించారు. అడిషనల్ ఐజీ ఉదయభాస్కర్ పాల్గొన్నారు.



న్యాయమూర్తి తనిఖీలు
గుంటూరుమెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి టి.లీలావతి తనిఖీ చేశారు.



దుర్గమ్మ సేవలో..
విజయవాడ: ఉప ముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

ప్రగతి పండగ

● అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన ● శరవేగంగా గుంటూరు జిల్లా పురోగమనం ● వేలకోట్ల రూపాయలతో సంక్షేమం ● అన్ని వర్గాలకూ సమన్యాయం

కులం చూడం, మతం చూడం, ప్రాంతం చూడం, పార్టీ చూడం అని ఎన్నికల ముందు చెప్పిన విధంగానే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధితోపాటు సంక్షేమం పరుగులు పెడుతోంది. అన్నివర్గాలకూ న్యాయం జరుగుతోంది. పార్టీకి ఓటు వేయని వారి గడపల్లోనూ సంక్షేమ సిరులు రంగవల్లులై వికసిస్తున్నాయి. గుంటూరు జిల్లా ప్రగతిబాటన పురోగమిస్తూ పరవళ్లు తొక్కుతోంది. జయహో జగన్ అంటూ నినదిస్తోంది.

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా సంక్షేమం–అభివృద్ధి జోడు గుర్రాల సవారీ చేస్తోంది. అభివృద్ధి పథంలో పయనిస్తోంది. మన బడి నాడు–నేడు ద్వారా పాఠశాలలు, ఆస్పత్రులు సకల వసతులతో ఆధునిక హంగులు అద్దుకున్నాయి. కొత్త గ్రామీణ, అర్బన్ పీహెచ్‌సీలు అందుబాటులోకి వచ్చాయి. ఇంటి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోనే వైద్య వసతులు కొలువుదీరాయి. మంచానికే పరిమితమైన వారి కోసం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గడప వద్దకే వైద్యసేవలు తరలివస్తున్నాయి. ఫలితంగా సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

'గడప గడప'నా ఆనందాలు
గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని ప్రభుత్వం భావిస్తోంది. ఫలితంగా ఎమ్మెల్యేలు ఇప్పటికే ప్రతి గడపకూ వెళ్లి సమస్యలు గుర్తించి పరిష్కారానికి కృషి చేశారు. ఇప్పటి వరకూ జిల్లాలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.67.14 కోట్ల విలువైన 1,029 పనులు గుర్తించి మంజూరు చేశారు. వీటిలో 467 పనులు పురోగతిలో ఉన్నాయి.



పేరేచర్లలోని వైఎస్సార్-జగనన్న కాలనీ

445 పనులు పూర్తయ్యాయి. మొత్తం 33.24 కోట్ల రూపాయల విలువైన పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. 406 బిల్లులు అప్‌లోడ్ చేయగా రూ.25.99 కోట్ల బిల్లులు మంజూరయ్యాయి. ఇంకా 117 పనులు ప్రారంభం కావాల్సి ఉంది. ఒక్క గుంటూరు మున్సిపాలిటీలోనే 29.19 కోట్ల రూపాయల పనులు ప్రారంభం కావడం విశేషం.

ధర్మప్ర'భూ' జగన్
దశాబ్దాలుగా నిషేధిత భూముల జాబితాలో ఉన్న వేలాది ఎకరాలకు ప్రభుత్వం విముక్తి కల్పించింది. చుక్కల భూములు, వివిధ విభాగాల్లో ఉన్న 22ఏ భూములు మొత్తం 2,339.15 ఎకరాలపై సర్వహక్కులూ సాగుదారులకే అప్పగిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే నిబంధన మేరకు 442.71 ఎకరాల అసైన్డ్ భూమినీ నిషేధిత జాబితా నుంచి తొలగించి హక్కుదారులకు అప్పగించేందుకు సర్కారు నిర్ణయం తీసుకుంది. లంక భూముల్లో వ్యవసాయం చేసుకునే రైతులకూ ప్రభుత్వం వరమిచ్చింది. భూమిని వారికి లీజుకి ఇచ్చేలా నిర్ణయం తీసుకుంది. ఫలితంగా కొల్లిపర మండలం అన్నవరంలో 67.72 ఎకరాలలో 182 మంది రైతులకు, బొమ్మువాని పాలెంలో 182.56 ఎకరాల్లో 228 మంది రైతులకు లబ్ధి చేకూరింది.

పారిశ్రామిక పరుగులు
జిల్లాలో పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తోంది. ఈ ఏడాది కొత్తగా 104 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చారు. కొత్తగా మూడు క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. మంగళగిరిలో చేనేత క్లస్టర్ ఇప్పటికే ప్రారంభం కాగా, తెనాలిలో బంగారు పరిశ్రమ క్లస్టర్, దాల్ మిల్ క్లస్టర్ పనులు నడుస్తున్నాయి.

'గృహ'త్తర యజ్ఞం
పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా మూడు లక్షల మందికి 6,660 ఎకరాల భూమిని 1,240 కోట్ల రూపాయల ఖర్చుతో అభివృద్ధి చేసి కేటాయించారు. రాజధాని ప్రాంతం సీఆర్డీఏ పరిధిలో 50,793 మంది పేద అక్కచెల్లెమ్మలకు ఇళ్లస్థలపట్టాలు పంపిణీ చేశారు. రూ.443.71 కోట్లతో నిర్మించిన 5,024 టిడ్కో ఇళ్లనూ లబ్ధిదారులకు అందించారు.



కొత్తగా నిర్మించిన గుంటూరు ఆదర్శ నగర్ మెయిన్‌రోడ్డు

గుంటూరు అభివృద్ధికి పెద్దపీట



గుంటూరు గాంధీ పార్కు

గుంటూరు నగరంలో రూ.491 కోట్లతో కొత్తగా రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రజల చిరకాల వాంఛగా ఉన్న పీవీకే నాయుడు మార్కెట్ నిర్మాణానికి మార్గం సుగమమైంది. దీని కోసం రూ.163 కోట్లతో డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసి టెండర్లు పిలిచారు. నగరంలో 22 పార్కులను సుమారు రూ.తొమ్మిది కోట్లతో ఆధునికీకరించారు. గాంధీపార్కును సరికొత్త హంగులతో పునరుద్ధరించారు. నగరంలోని 15 ఐలాండ్స్‌ని రూ.2.56 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. 42 కిలో మీటర్ల మేర ఉన్న సెంట్రల్ డివైడర్లలో మొక్కలు ఏర్పాటు చేసి రూ.6.24 కోట్లతో అందంగా తీర్చిదిద్దుతున్నారు.

ఇతర పథకాల లబ్ధిదారులు ఇలా..

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య
జగనన్న గోరుముద్ద	84,944
జగనన్న విద్యా కానుక	94,140
రైస్ కార్డులు	90,514
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	1,23,365

ప్రాధాన్య భవనాల అభివృద్ధి



గ్రామ సచివాలయాలు

జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్య భవనాల అభివృద్ధికి సర్కారు పెద్దపీట వేసింది. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 311 సచివాలయ భవనాలు, 138 రైతు భరోసా కేంద్రాలు, 346 స్కూల్ ప్రహరీలు, 96 వైఎస్సార్ క్లినిక్‌లను 627 కోట్ల రూపాయల అంచనాతో పూర్తి చేసింది. 139 బల్క్‌మిల్క్ యూనిట్లు, 165 వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ భవనాల నిర్మాణం పురోగతిలో ఉంది.
- మనబడి నాడు–నేడు రెండో దశలో భాగంగా 562 స్కూళ్లను రూ. 215.08 కోట్లతో ప్రభుత్వం ఆధునికీకరిస్తోంది.

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు మేలు ఇలా..

పథకం పేరు	లబ్ధిదారులు	మొత్తం (రూ.కోట్లలో)
వైఎస్సార్ ఆసరా	29,0994	808.60
జగనన్న అమ్మ ఒడి	20,1590	657.39
జగనన్న అమ్మఒడి (ఆదర్శ్)	18,7574	47.32
అర్చకుల గౌరవ వేతనం	1,051	0.53
జగనన్న చేదోడు	11,397	32.59
వైఎస్సార్ ఉచిత వంటల బీమా	57,207	74.47
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	67.72	25,401
ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనం	120	0.06
వైఎస్సార్ ఇన్‌పుట్ సబ్సిడీ	65,758	78.10
జగనన్న తోడు (ఇన్‌ట్రస్ట్)	33,485	1.47
జగనన్న తోడు (రుణాలు)	68,163	108.32
జగనన్న వసతి దీవెన	1,05,471	115.86
జగనన్న విద్యా దీవెన	1,15,392	364.94
వైఎస్సార్ కల్యాణమస్తు	1,297	11.65
వైఎస్సార్ కాపు నేస్తం	21,502	97.71
వైఎస్సార్ లా నేస్తం	243	3.04
వైఎస్సార్ మత్స్యకార భరోసా	269	0.58
వైఎస్సార్ నేతన్న నేస్తం	940	7.30
పాస్టర్ల గౌరవ వేతనం	1823	0.91
వైఎస్సార్ రైతు భరోసా	1,77,545	885.97
వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాలు	48,397	13.61
వైఎస్సార్ సున్నావడ్డీ (ఎస్‌హెచ్‌జీఎస్)	3,77,515	100.73
వైఎస్సార్ వాహన మిత్ర	17,574	61.16
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	54,315	42.26
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	86,931	394.80
వైఎస్సార్ బీమా	5,324	79.33
వైఎస్సార్ చేయూత	1,14,844	503.93
వైఎస్సార్ పెన్షన్ కానుక	2,96,952	2,847.82
జగనన్న విదేశీ విద్యా దీవెన	42	3.6
జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం	4	0.04
మొత్తం	24,14,735	7,955.54

గుంటూరు చానల్ విస్తరణకు రంగం సిద్ధం



గుంటూరు చానల్ విస్తరణ పనులకు రంగం సిద్ధమైంది. దీనికోసం పెదనందిపాడు, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు మండలాల్లోని 11 గ్రామాల్లో 381.237 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉండగా ఇప్పటికే ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేశారు. అభ్యంతరాల స్వీకరణ తర్వాత రావిపాడు, గోరిజవోలుగుంటపాలెం, కొండేపాడు, యనమదల, గారపాడు గ్రామాలకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

న్యూస్‌రీల్

నేడు తాడికొండలో సామాజిక సాధికార యాత్ర



తాడికొండ బస్టాండ్ కూడలిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అయోధ్య, మర్రి, సుచరిత

తాడికొండ: తాడికొండలో శనివారం వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత చెప్పారు. శుక్రవారం తాడికొండ బస్టాండ్ సెంటర్‌లో సామాజిక సాధికార యాత్రలో భాగంగా బహిరంగ సభ ఏర్పాటు చేసే ప్రాంతాన్ని వారు పరిశీలించారు. ఏర్పాట్లపై చర్చించారు. సభకు భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వసతుల కల్పనపై చర్చించారు. శనివారం సాయంత్రం 3 గంటలకు తాడికొండ అడ్డరోడ్డుకు నాయకులు కార్యకర్తలతో చేరుకుని కలిసి విలేకరుల సమావేశం నిర్వహించిన అనంతరం అడ్డరోడ్డు నుంచి ర్యాలీగా బయలుదేరి తాడికొండ ప్రారంభం నుంచి పాదయాత్రగా బహిరంగ సభా ప్రాంతానికి చేరుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే, పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత మాట్లాడుతూ సాధికార యాత్రను ప్రజలు, పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్, ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌ఈబీ ఏఎస్పీగా వెంకటేశ్వరరావు
నగరంపాలెం: గుంటూరు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ–సెబ్) అదనపు ఎస్పీ (ఏఎస్పీ)గా మొగలి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా పలువురు డీఎస్పీలకు అదనపు ఎస్పీ (ఏఎస్పీ)లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ క్రమంలో కాకినాడ ఎస్‌బీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావుకి ఏఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ, వెంటనే గుంటూరు జిల్లా ఎస్‌ఈబీ ఏఎస్పీగా నియమించారు. గతంలో ఏఎస్పీగా విధులు నిర్వర్తించిన డీఎస్. మహేష్‌కు నాన్ కేడర్ (ఎన్‌సీ) ఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ, విజయవాడ ఏసీబీ ఎస్పీగా బదిలీ చేసిన విషయం విదితమే. బాపట్ల జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఏవీ.రమణకు ఏఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పించగా, ఆయన్ను ఇంటిలిజెన్స్ ఏఎస్పీగా నియమితులయ్యారు.

జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ



జగనన్న విద్యాజ్యోతి స్టడీమెటీరియల్‌ను పరిశీలిస్తున్న డీవైఈవో వెంకటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థుల కోసం జెడ్పీ ఆధ్వర్యంలో ముద్రించిన జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను గుంటూరు డివిజన్ పరిధిలోని పాఠశాలలకు శనివారం పంపిణీ చేయనున్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో శనివారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. దీనివల్ల డివిజన్ పరిధిలోని 107 పాఠశాలల్లో 7,700 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం జిల్లా పరీక్షా భవన్‌లో భద్రపరిచిన విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పుస్తకాలను శుక్రవారం గుంటూరు డీవైఈవో పి.వెంకటేశ్వరరావు పరిశీలించారు. శనివారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా అధ్యక్షతన జరగనున్న కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలను అందజేస్తామని చెప్పారు.

నలుగురు సీఐల బదిలీ
నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు రేంజ్ పరిధిలో నలుగురు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. బాపట్ల రూరల్ సర్కిల్ సీఐ జి.వేణుగోపాలరెడ్డిని గూడూరు రూరల్ సర్కిల్‌కు, గూడూరు రూరల్ సర్కిల్ సీఐ జి.దశరథరామయ్యను రేంజ్ వీఆర్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న కొండవీటి శ్రీనివాసరావును కావలి టూ టౌన్ యూపీఎస్, ఎస్పీఎస్‌కు, కావలి టూ టౌన్ యూపీఎస్, ఎస్పీఎస్ సీఐగా పనిచేస్తున్న ఎ.సుధాకర్‌ను రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు.

విద్యా దీవెనను వినియోగించుకోవాలి



నగదు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, కలెక్టర్ రంజిత్‌బాషా

- కలెక్టర్ రంజిత్‌బాషా
- జిల్లాలో 25,973 మందికి లబ్ధి
- రూ.20.73 కోట్ల మేర ప్రయోజనం

బాపట్ల: విద్యాదీవెన పథకాన్ని విద్యార్థులు వినియోగించుకుని ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. జగనన్న విద్యాదీవెన నగదు పంపిణీ కార్యక్రమాన్ని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి శుక్రవారం ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో కలెక్టర్ రంజిత్ బాషా, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, లబ్ధిదారులు పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు కలెక్టర్, ఎమ్మెల్యే నమూనా చెక్కు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 25,973 మంది విద్యార్థులకు రూ.20.73 కోట్ల నగదు విడుదలైనట్టు వెల్లడించారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిని జె.రాజాదిబోరా, బీసీ సంక్షేమశాఖ అధికారి బి.అర్జున్ రావు, పర్యవేక్షకులు ఆంధ్ర శ్రీనివాసులు, సహాయ సంక్షేమ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంట వ్యర్థాలు దగ్ధం చేస్తూ రైతు సజీవదహనం



రైతు మృతదేహాన్ని పరిశీలిస్తున్న అమృతలూరు ఎస్‌ఐ సురేష్

అమృతలూరు (కొల్లూరు) : పంట వ్యర్థాలను దగ్ధం చేస్తూ, రెండో పంటకు పొలాన్ని సిద్ధం చేసుకునేందుకు వెళ్లిన ఓ రైతు ప్రమాదవశాత్తు మంటలబారిన పడి సజీవదహనమైన హృదయవిదారక ఘటన అమృతలూరు మండలం మోపర్రులో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మోపర్రుకు చెందిన మోదుకూరు బాలాంజనేయులు (52) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పొలంలో వరికోత యంత్రం సాయంతో కోతలు పూర్తి చేసిన అనంతరం మిగిలిన వరి తుక్కును దగ్ధం చేసేందుకు శుక్రవారం పంట భూమికి వెళ్లాడు. తను సాగుచేసిన పొలంలో పంట వ్యర్థాలను తగులపెడుతున్న సమయంలో మంటలు పక్క పొలం వైపు ఎగబాకుతుండటం గమనించి వాటిని అదుపు చేసేందుకు వెళ్లాడు. హృద్రోగ సమస్యతో బాధపడుతున్న బాలాంజనేయులు పొగ వల్ల ఊపిరి అందక అపస్మారక స్థితికి చేరుకుని పడిపోయాడు. మంటలు అతను పడిపోయిన ప్రాంతాన్ని చుట్టుముట్టడంతో అతను సజీవదహనమయ్యాడు. పొలాల్లో పనులకు వెళ్లిన వ్యక్తులు సాయంత్రం బాలాంజనేయులు దగ్ధమై మృతి చెంది ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులతోపాటు, అమృతలూరు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా ప్రాంతానికి చేరుకున్న ఎస్‌ఐ సురేష్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీవ్ర విషాదం

- జ్యూయలరీ వ్యాపారి కుటుంబం ఆత్మహత్య
- ఆర్థిక ఇబ్బందులు భరించలేకే!
- సైనైడ్ కలిపిన బిర్యానీ తిని బలవన్మరణానికి యత్నం
- భార్యాభర్తలు, ఇద్దరు కుమార్తెలు మృతి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మూడో కుమార్తె
- కుటుంబం స్వస్థలం తెనాలి
- అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న అనకాపల్లి పోలీసులు



శివరామకృష్ణ కుటుంబం (ఫైల్)



విగత జీవులుగా శివరామకృష్ణ కుటుంబం

సాక్షి, అనకాపల్లి: పట్టణంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అప్పుల బాధ తాళలేక జ్యూయలరీ వ్యాపారి కుటుంబ సభ్యులతో సహా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బిర్యానీలో సైనైడ్ కలిపి భార్య, ముగ్గురు పిల్లలతో తినిపించి బలవన్మరణానికి యత్నించాడు. ఈ హృదయవిదారక ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వీరిలో నలుగురు మృతి చెందగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన జ్యూయలరీ వ్యాపారి కొడవలి శివరామకృష్ణ తన కుటుంబంతో ఏడాది క్రితం అనకాపల్లికి వచ్చారు. అనకాపల్లి టౌన్‌లో పెరుగుబజారు సమీపంలో జ్యూయిలరీ షాపును ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందులతో స్వస్థలాన్ని వీడిన రామకృష్ణ స్థానిక ఉడ్ పేటలో ఫైర్ స్టేషన్ పక్కన లక్ష్మీ ప్యారడైజ్ అపార్ట్‌మెంట్‌లో భార్య మాధవి దేవి (40), కుమార్తెలు వైష్ణవి (15), జాహ్నవి (12), కుసుమప్రియతో కలిసి నివాసముంటున్నారు. తన పిల్లలను స్థానిక సిటీ పబ్లిక్ స్కూల్లో చదివిస్తున్నారు. పిల్లలు తొమ్మిది, ఏడు, మూడు తరగతులు చదువుతున్నారు. అనకాపల్లికి వచ్చిన ప్రారంభంలో రామకృష్ణ ఓ బంగారం షాపులో ఉద్యోగం చేసేవాడు. ఆ తరువాత సొంతంగా జ్యూయలరీ షాపు పెట్టుకున్నాడు. ఏడాదిన్నర నుంచి అనకాపల్లి టౌన్‌లోనే ఉన్నా వ్యాపారరీత్యాగానీ, పని నిమిత్తంగానీ ఎవరితోనూ వివాదం పెట్టుకున్న సందర్భాలు లేవు. అయితే ఆ కుటుంబం చుట్టుపక్కల వారితో కలివిడిగా ఉండేవారు కాదని, ముభావంగా అంటీముట్టనట్టు ఒంటరిగా ఉండేవారని స్థానికులు తెలిపారు.

భార్యాపిల్లలకు తెలీకుండా!
రామకృష్ణ గురువారం రాత్రి 9 గంటలకు దుకాణం నుంచి ఇంటికి వచ్చాడు. సైనైడ్ కలిపిన బిర్యానీ తీసుకొచ్చాడు. ఆ విషయం భార్యాపిల్లలకు తెలీదు. కుటుంబమంతా బిర్యానీ తిన్నారు. అంతలో చిన్న కూతురు కుసుమ వాంతి చేసుకుంది. కొద్ది క్షణాల్లోనే మిగతావారంతా నేలకొరిగారు. ఈ విషయం గమనించిన కుసుమ పక్కింటికి వెళ్లి అమ్మ, నాన్న నిద్రపోయి లేవలేదు అని ఏడుస్తూ చెప్పింది. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వాంతులు చేసుకున్న చిన్నారిని హుటాహుటిన స్థానిక ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. అనంతరం కేజీహెచ్‌కు తరలించారు.

మూడేళ్లుగా దూరం
రామకృష్ణ అప్పులు చేసి ఎవరికీ తెలియకుండా అనకాపల్లి టౌన్‌లో నివసిస్తున్నట్టు అనకాపల్లి చేరుకున్న అతని సోదరుడు వెంకటేశ్వరరావు చెప్పిన వివరాల ప్రకారం తెలుస్తోంది. సుమారుగా మూడేళ్లుగా కుటుంబ సభ్యులతో సఖ్యత లేదని తెలుస్తోంది. మృతదేహాలను చూసేందుకు ఒక సోదరుడు మినహా కుటుంబ సభ్యులు ఎవరూ రాలేదు.

ఆధారాలు లేవు
ఘటన స్థలంలో ఆత్మహత్యకు సంబంధించిన ఎటువంటి ఆధారాలూ లభించలేదని డీఎస్పీ వి.సుబ్బరాజు చెప్పారు. క్లూస్‌టీమ్ ఇంటిలో అన్ని గదులనూ క్షుణ్ణంగా పరిశీలించిందని పేర్కొన్నారు. బిర్యానీ ప్యాకెట్లతో భోజనం చేస్తూ అక్కడిక్కడే నలుగురు మృతి చెందగా, కుసుమప్రియ అపాయం నుంచి తప్పించుకుందని, ప్రస్తుతం కేజీహెచ్‌లో కోలుకుంటోందన్నారు. శివరామకృష్ణ అన్నయ్య వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దాడి మోహనరావు చెప్పారు.

47,192 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 45,336 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 47,192 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 23,300 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది.

క్లుప్తంగా

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులు



నిజాంపట్నం: జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో నిజాంపట్నం విద్యార్థులు పాల్గొంటున్నట్లు బోధిధర్మ తైక్వాండో అకాడమీ ఫౌండర్, ఇంటర్నేషనల్ మాస్టర్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొననున్న విద్యార్థులతో నిజాంపట్నంలో శుక్రవారం ఆయన మాట్లాడారు.ఈ నెల 30, 31వ తేదీల్లో రేపల్లె పట్టణంలో జరగనున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు తమ విద్యార్థులు 20 మంది ఎంపికైనట్లు తెలిపారు.ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని పలు బహుమతులు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామపెద్దలు పోటీలకు వెళ్లనున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

6న రాష్ట్ర స్థాయి మెగా క్రికెట్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్: ఫ్రెండ్స్ క్రికెట్ క్లబ్, సచిన్ స్పోర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి ఆరు నుంచి 13వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లాలో రాష్ట్ర స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆర్.సుధాకర్, వి.నాని వెల్లడించారు. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులోని అంతర్జాతీయ క్రికెట్ మైదానాల్లో జరిగే ఈ పోటీలకు 20 జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. విన్నర్ జట్టుకు రూ. 5 లక్షలు, రన్నర్ జట్టుకు రూ. 3 లక్షలు నగదు బహుమతితో పాటు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న క్రీడాకారులు 7075266438, 8332983777ను సంప్రదించాలని కోరారు.



సాంఘిక నాటకం విభాగంలో ప్రథమ బహుమతి 'ఇంద్రప్రస్థం' (గుంటూరు)



సాంఘిక నాటిక ప్రథమ బహుమతి 'ఆస్తికలు' (గుంటూరు)..



పద్య నాటకంలో ప్రథమ బహుమతి 'శ్రీమాధవ వర్మ' (విజయవాడ)

'నంది' అవార్డుల ప్రదానం

నంది నాటకోత్సవం శుక్రవారం ముగిసింది. గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వారం రోజులు పాటు నిర్వహించిన వేడుకలో కళాకారులు అత్యుత్తమ ప్రదర్శనలిచ్చారు. ప్రభుత్వం తరపున సాంఘిక నాటిక, నాటకం, పద్య నాటకం, బాలల నాటిక విజేతలకు స్వర్ణనందులు అందజేశారు.

–పాతగుంటూరు



బాలల నాటిక ప్రథమ బహుమతి 'ప్రపంచతంత్రం' (విజయవాడ)



యూనివర్సిటీ కాలేజీ నాటిక ప్రథమ బహుమతి 'ఇంకానా' (విజయవాడ)

గ్రామీణ క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తుకు నాంది

ఎమ్మెల్సీ పోతుల సునీత



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్సీ సునీత

చీరాల/వేటపాలెం: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసి వారిని ఉత్తమ క్రీడాకారులుగా తయారు చేసేందుకే సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. చీరాల, వేటపాలెం మండలాల్లో జరుగుతున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. వేటపాలెం సెయింటాన్స్ కళాశాలలో జరుగుతున్న పోటీలను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో విజయవంతంగా నిర్వహించేందుకు సీఎం జగన్ ప్రణాళికలు రూపొందించారన్నారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని యువతీ, యువకులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం కార్యక్రమం విజయవంతానికి నిదర్శనమన్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీల ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేసేందుకు ఆడుదాం ఆంధ్రా బాగా ఉపయోగపడుతుందన్నారు. గ్రామస్థాయిలో సమన్వయ కమిటీ సభ్యులైన పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, మహిళా పోలీస్, స్కూల్ హెచ్ఎం, పీడీ, పీఈటీ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు సమర్థవంతంగా పనిచేసి పోటీలను విజయవంతం చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు పోతుల సురేష్, సెయింటాన్స్ స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పీఈటీలు, పంచాయతీల సెక్రటరీలు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం ఎమ్మెల్సీని సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు అంకిత భావంతో పనిచేయాలి

ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

చీరాల: వైఎస్సార్ సీపీలో పదవులు పొందిన నాయకులు అంకితభావంతో పనిచేసి మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు శక్తివంచన లేకుండా పనిచేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి సూచించారు. చీరాల పట్టణం క్లస్టర్–1 యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన బోరా జగ్గారావు శుక్రవారం ఎమ్మెల్యే కరణం బలరాంను ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తమకు రాష్ట్రస్థాయిలో పదవులు ఇవ్వడంపై సీఎం జగన్, ఎమ్మెల్యే కర ణం బలరాం, వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయడంతో పాటుగా సీఎంగా జగనన్నను గెలిపిస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్ కీర్తి వెంకటరావు, రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీ యాతం మధుకర్ (మేరిబాబు), తదితరులు ఉన్నారు.

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి

డీఎస్పీ టి.వెంకటేశులు



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ

బాపట్లటౌన్: పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని డీఎస్పీ టి.వెంకటేశులు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రికార్డుల నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. నైట్‌బీట్‌లో విధులు నిర్వహించే సిబ్బంది తప్పనిసరిగా విజిల్స్ ఉపయోగించాలన్నారు. అనుమానితులు కనిపిస్తే వేలి ముద్రలు సేకరించాలన్నారు. రౌడీషీటర్ల కదలికలపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టాలన్నారు. వారికి ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ యు. శ్రీనివాసులు, పట్టణ ఎస్ఐలు షేక్. రఫీ, ట్రాఫిక్ ఎస్ఐ కె. సుధాకర్ పాల్గొన్నారు.

సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు జిల్లా ప్రాజెక్టు ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు గుంటూరు జిల్లా టీం ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శుక్రవారం తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లాలో ఈనెల 28, 29వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు ప్రతిభ చాటినట్లు చెప్పారు. మంగళగిరిలోని సీకేజీఆర్‌సీ పాఠశాలకు చెందిన విద్యార్థులు మహాలక్ష్మి, ఎస్.నాగచైతన్య తయారు చేసిన మల్టీపర్పస్ వీల్‌చైర్ ప్రాజెక్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు వివరించారు. విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ బి. టైటాస్‌ను అభినందించారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ విజేత మాచవరం ఉపాధ్యాయుడు



బహుమతి అందుకుంటున్న అంకమయ్య

మాచవరం: కడప నగరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మాచవరం జెడ్పీ స్కూల్‌కు చెందిన సైన్స్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు దావల అంకమయ్య అత్యుత్తమ ప్రతిభను చూపి విజేతగా నిలిచారు. ఇటీవల జిల్లా కేంద్రమైన నర్సరావుపేటలో నిర్వహించిన పల్నాడు జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఉపాధ్యాయ విభాగంలో అంకమయ్య తయారు చేసిన ఆధునిక వీధి దీప స్తంభాలు ప్రాజెక్టుకు జిల్లాస్థాయిలో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలోనూ విజేతగా నిలిచి, జాతీయ స్థాయిలో జరిగే సదరన్ ఇండియా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు. ప్రాజెక్టు వలన కలిగే బహుళ ప్రయోజనాలను ఆయన కమిటీకి వివరించారు. రాష్ట్ర స్థాయిలో బహుమతి పొంది, జాతీయ స్థాయికి ఎంపికైన ఉపాధ్యాయుడు అంకమయ్యకు ఎస్‌సీఈఆర్‌డీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, కడప జిల్లా విద్యాశాఖధికారి రాఘవరెడ్డిలు మెమొంటోను, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. విజేతగా నిలిచిన అంకమయ్యను పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి పి. శామ్యూల్, ఉప విద్యాశాఖాదికారి, సైన్స్ ఆఫీసర్ ఎ.మధుకుమార్, హెచ్ఎం సురేష్ బాబు, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

హృద్రోగ బాధితులకు అండగా బజరంగ్



విజయవాడ మెడ్‌స్టార్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన తక్కెళ్లపాడు గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: హృద్రోగ బాధితులకు బజరంగ్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ అండగా నిలిచి వైద్యసేవలు అందిస్తున్నారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బజరంగ్ సంక్షేమ సంగమం కార్యక్రమాన్ని ఈనెల 27న తక్కెళ్లపాడులో నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన 'మీ గుండె పదిలం' శిబిరంలో యాంజియోగ్రామ్ పరీక్ష అవసరమైన 26 మందిని గుర్తించారు. వారిలో తొలి విడతగా 13 మందిని ప్రత్యేక బస్సులో విజయవాడ మెడ్ స్టార్ ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలతో నిర్వహించిన యాంజియోగ్రామ్ పరీక్షల్లో పది మందికి ఆరోగ్యస్థితి మెరుగ్గానే ఉందని, ఇద్దరికి స్టంట్లు వేయాలని, ఒకరికి బైపాస్ సర్జరీ చేయాలని డాక్టర్లు నిర్ధారించారు. చికిత్స పొందుతున్న వారందరినీ బజరంగ్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద వయస్సులో ఉన్న వారంతా ఏటా క్రమం తప్పకుండా ఒకసారి గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జగనన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా 'మీ గుండె పదిలం' నినాదంతో చేపట్టిన వైద్య శిబిరాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. గుండె సమస్య ఉన్న వారు అది తీవ్రం కాకముందే ఈ శిబిరం ద్వారా వైద్య సహాయం పొందుతున్నారని చెప్పారు. బాధితులకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేస్తూ, వేగవంతంగా సకాలంలో వైద్య సహాయం అందేందుకు తోడ్పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు స్ఫూర్తితో నిర్వహించామని పేర్కొన్నారు. తక్కెళ్లపాడు నుంచి ప్రత్యేక బస్సు ద్వారా శ్రద్ధగా పేషెంట్లను బజరంగ్ బృందం ఆస్పత్రికి చేర్చడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు మెడికల్: ఏపీ ఎన్జీవో అసోసియేషన్ 2024 టేబుల్ క్యాలెండర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు ఎస్.రాజశేఖర్, కోశాధికారి ఎల్.శ్రీధర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి కె.శ్రీనివాసరావు, మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి, నగర శాఖ అధ్యక్షులు ఎస్‌పీఎస్ సూరి, కార్యదర్శి సిహెచ్ కల్యాణ్‌కుమార్, సహ అధ్యక్షులు బి.సునీల్‌కుమార్, సంయుక్త కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, మహిళా విభాగం చైర్‌పర్సన్ రాధారాణి పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

జేసీ సిహెచ్ శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

బాపట్లటౌన్: దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తామని జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం బాపట్ల కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. తొలుత విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి అర్చన ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేశారు. జేసీ శ్రీధర్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఈ ఏడాది 1750 మూడు చక్రాల మోటార్ సైకిళ్ళను దివ్యాంగులకు అందజేస్తున్నామన్నారు. జి అర్చన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం అనునిత్యం సహకారం అందిస్తూనే ఉందన్నారు. వృద్ధులు, దివ్యాంగుల అవసరాలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. అనంతరం 10 మందికి ట్రై సైకిళ్లు, 5గురికి వీల్ చైర్స్, మరో 10మందికి చంక కర్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు, బాపట్ల జిల్లా వైఎస్ఆర్‌సీపీ విభాగం అధ్యక్షులు చల్లా రామయ్య, దివ్యాంగుల అసోసియేషన్ నాయకులు షేక్ కాలేషా, గోగన ఆదిశేషు, నటరాజ్, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు వెంకన్న బాబు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ ముంతాజ్ పటాన్ పాల్గొన్నారు.

నాటకరంగానికి రవవరపు సేవలు చిరస్మరణీయం

పీఠాధిపతులు స్వామి రామానంద ప్రభూజీ



గ్రంథావిష్కరణ చేస్తున్న పీఠాధిపతులు స్వామీ రామానంద ప్రభూజీ

ఓలేరు(భట్టిప్రోలు): నాటక రంగం ద్వారా ఓలేరు గ్రామానికి వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్తి రవవరపు శ్యామ సుందరరావు పలువురికి ఆదర్శ ప్రాయుడని సాయిదత్త పీఠం ద్వితీయ పీఠాధిపతులు స్వామి రామానంద ప్రభూజీ అన్నారు. భట్టిప్రోలు మండలం ఓలేరు మాజీ సర్పంచ్, మాజీ వైస్ ఎంపీపీ ప్రముఖ రంగస్థల నటులు, సినీ నిర్మాత వాస్తు సిద్ధాంతి రవవరపు శ్యామ సుందరరావు చతుర్థ వర్ధంతిని పురస్కరించుకుని ఆయనచే రచింపబడిన శ్రీ షిర్డి సాయి భగవద్గీత గ్రంథావిష్కరణ శుక్రవారం రాత్రి సాయిదత్త పీఠం ద్వితీయ పీఠాధిపతులు స్వామి రామానంద ప్రభూజీ, ఏపీ మాజీ ఉప సభాపతి డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్‌లచే గ్రంథావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా స్వామి రామానంద ప్రభూజీ మాట్లాడుతూ సాయి తత్వంతో భగవద్గీతను రూపొందించడం మహత్ కార్యమని తెలిపారు. తండ్రి ఆశయ సాధన కోసం ఆయన తనయులు శ్రీనివాస్ పడిన తపన అనిర్వచనీయమని పేర్కొన్నారు. ఏపీ నాటక కళా పరిషత్ చైర్మన్ కళారత్న గుమ్మడి గోపాల కృష్ణ మాట్లాడుతూ కవి, కళాకారులకు వార్ధక్యం ఉండదని తెలిపారు. ఆధ్యాత్మిక భావాలతో రూపొందించిన ఈ గ్రంథాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు పుత్రుడిగా శ్రీనివాస్ తన తండ్రిని సజీవుడ్ని చేశాడని కొనియాడారు. ఏపీ శాసన సభ మాజీ ఉప సభాపతి డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ పుత్రుడు పుట్టినప్పుడు కాదు జనులు ఆ పుత్రుడ్ని ప్రశంసిస్తుంటే కలిగే సంతోషం ఆనందం అంతింత కాదని వేమన శతకంలోని పద్యాన్ని గుర్తు చేస్తూ శ్యామ సుందరరావు తనయులు శ్రీనివాస్‌ను అభినందించారు. తెలంగాణా ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న మాట్లాడుతూ కళల పట్ల ఇక్కడ ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలు అనిర్వచనీయమన్నారు. గుమ్మడి గోపాల కృష్ణ తన పద్యాలు, గోరేటి వెంకన్న తన పాటలతో సభికులను ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో బౌడ చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, రేపల్లె మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య, జాతీయ మహిళా కమిషన్ పూర్వ సభ్యురాలు నిర్మాలా వెంకటేష్ పాల్గొని ప్రసంగించారు. సభకు ఎన్టీఆర్ కళాపరిషత్ వ్యవస్థాపకులు మన్నె శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అనంతరం రంగస్థల కళాకారులను సన్మానించి సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకం, గయోపాఖ్యానం నాటకం (వార్ సీను) ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి తిలకించేందుకు కళాకారులు, కళా ప్రేక్షకులు, కళాభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

అనాటమీ డి సెక్షన్ హాలు ఆధునికీకరణ

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల 1998 బ్యాచ్‌కు చెందిన వైద్య విద్యార్థి డాక్టర్ బేతపూడి గిరిధర్‌రాజా రూ.10 లక్షలు విరాళం అందించడంతో వైద్య కళాశాలలో అనాటమీ డి సెక్షన్ హాలును ఆధునికీకరించి స్మార్ట్ బోర్డు ఏర్పాటు చేశారు. డాక్టర్ గిరిధర్‌రాజా తల్లిదండ్రులు బేతపూడి జోసఫ్ స్టాన్లీ, హేమలత దంపతుల జ్ఞాపకార్థం అనాటమీ డిసెక్షన్ హాలు ఆధునికీకరణకు విరాళం అందజేసినట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి తెలిపారు. శుక్రవారం హాలును డాక్టర్ బేతపూడి గిరిధర్‌రాజాతో కలసి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ సావిత్రి, వైస్ ప్రిన్సిపాల్‌స డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.